




19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 28 అక్టోబర్ 2025 పేజీలు 8


## తుఫానును ఎదుర్కొనేందుకు

# యంత్రాంగం ఏకతాటిపై నిలవాలి




- విపత్తు స్పందనలో అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా పాల్గొనాలి
- డివిజన్, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ
- ప్రతి సచివాలయానికి ఒక పోలీస్‌ను కేటాయించాలి
- ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- జేసీబీలు, డ్రోన్లను అందుబాటులో ఉంచుకోవాలి
- పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్ బాబు

**విజయవాడ బ్యూరో, అక్టోబర్ 27, మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని శాఖల సిబ్బంది పూర్తి సమన్వయంతో, ఏకతాటిపై ఉండడం ద్వారా మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులతో కలెక్టర్, పోలీస్ కమిషనర్ దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో ప్రత్యేక ప్రతిస్పందన బృందాలు (రెస్పాన్స్ టీమ్స్) మిగతా 2లో

## తుఫాన్ ప్రభావితాన్ని ఎదుర్కోవడానికి

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ అధికారులకు సూచనలు**

**పెడన, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి పకడ్బందీగా తగిన చర్యలు తీసుకున్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం నుంచి కృష్ణా జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడుతో కలిసి కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆ మండలాల్లోనీ తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ విభాగాలను, సురక్షిత పునరావాస కేంద్రాలను మిగతా 2లో...



నేడు నగరంలో సుమారు

# 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం

**ప్రజలు అత్యవసర సేవల కోసం తప్ప బయటకు రావద్దు**

**విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ షా ఆదేశాల మేరకు, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. సోమవారం ప్రకటన విడుదల చేసిన ప్రకటనలో మొంథ తుఫాను ప్రభావం రేపు 28 అక్టోబర్ న జిల్లాలో, ముఖ్యంగా విజయవాడ నగరంలో, సుమారు 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసినందున, జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లలోనే ఉండాలని విజ్ఞప్తి చేయారు.. అన్ని దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలి. ప్రజల సురక్షితార్థం ఈ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ప్రజలు అత్యవసర సేవల కోసం మాత్రమే (ఆరోగ్య సేవలు, ఆహార సేవలు మొదలైనవి) బయటకు రావాలని, మెడికల్ షాపులు, కూరగాయలు/పాలు విక్రయ కేంద్రాలు వంటి అవసరమైన సేవా కేంద్రాలు మాత్రమే తెరిచి ఉండాలని, అనవసర ట్రాఫిక్, రద్దీని నివారించాలన్నారు. మిగతా 2లో...

# ప్రాణ నష్టం జరక్కుండా

## ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి



- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలి
- గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, డయాలసిస్ పేషంట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- మూడు రోజులు ప్రజలందరూ ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండేలా అప్రమత్తం చేయండి
- జోనల్ ప్రత్యేక అధికారి ఆర్పీ సిసోడియా 2

(మొదటిపేజీ తరువాయి)

## నేడు సుమారు 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం

అవసరంలేని ప్రయాణాలు, షాపింగ్, వినోదం, ఉదయపు నడకలు, పార్కుల సందర్శనలు మొదలైనవి పూర్తిగా నివారించాలని ప్రజలని కోరారు. ప్రజలందరూ ఈ హెచ్చరికను గౌరవించి, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని – సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన నంబర్: డిస్ట్రిక్ట్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్: 9154970454, వీఎంసి కంట్రోల్ రూము: 0866 2424172, 0866 2422515, 0866 2427485

## తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి

### ఎస్సై శ్రీనివాస్



హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ : మెంథా తుఫాను పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ సూచించారు. బాపులపాడు మండలం వీరవల్లి, ఆరుగొలను,తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను రెవెన్యూ అధికారి సునీల్ కుమార్ తో కలిసి అయన అప్రమత్తం చేశారు.ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తక్షణమే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. మెంథా తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ, విపత్తుల నిర్వహణ శాఖ సూచన మేరకు లోతట్టు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు.తుఫాన్‌ను ఎదుర్కొవడానికి, ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ప్రభుత్వ శాఖల అధికార యంత్రాంగం చేసే సూచనలను ప్రజలందరూ పాటించాలని ముఖ్యంగా రైతులు తమ పంటల ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని తెలిపారు.

## అనిగండ్లపాడు ఆయుర్వేద వైద్యశాల పని వేళలలో తాళం వేసి మూసివేత




పెనుగంచిప్రోలు, అక్టోబర్ 28 మేజర్ న్యూస్ : ఆయుర్వేద వైద్యశాల ఎప్పుడు మూసి ఉంటుందో, ఎప్పుడు తెరచి ఉంటుందో తెలియక అసహనంతో వెను తిరిగి వెళుతున్న అనారోగ్యం కలిగిన అనిగండ్లపాడు ప్రజలు. యన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామంలో గల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సోమవారం రోజున డాక్టర్ లేకపోవడంతో పనివేళలో మూసివేసి తాళం వేసి ఉన్నది.వైద్య శాల పని వేళలు తెలియజేసే సమయ పట్టిక ఉండదు.ఆయుర్వేద వైద్యశాల వైద్యులు లేక పోవడం తో అనారోగ్యం కలిగిన వాళ్ళు వైద్య శాల కి వచ్చి మూసి వేసి ఉండటం తో అసహనం తో వెను తిరిగి వెళుతున్నారు.ఈ ఆయుర్వేద వైద్యశాల ఎప్పుడు తీసి ఉంటుందో ఎప్పుడు మూసి ఉంటుందో అని స్థానిక అనిగండ్లపాడు గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఆయుష్ ఆయుర్వేద ఉన్నతాధి కారులు సంబంధిత అనిగండ్లపాడు ఆయుర్వేద అధికారులు, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని స్థానిక అనిగండ్లపాడు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తుఫానును ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఏకతాటిపై నిలవాలి

(మొదటిపేజీ తరువాయి)



ఉండాలన్న గౌరవ ముఖ్యమంత్రి సూచన మేరకు ఇప్పటికే బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వారంతా క్షేత్రస్థాయిలో పర్యటించి, తుపాను ముప్పు ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడని వారిని తుపాను ప్రమాద తీవ్రత తెలిపి ఒప్పించాలని సూచించారు. మైకులలో అనౌన్స్ మెంట్ ద్వారా ప్రజలకు తుపాను ప్రమాద తీవ్రతను తెలియజేయా లన్నారు. తహసిల్దారులు, పోలీస్ సిబ్బంది కలసి తుపాను ప్రభావిత ప్రాంతాలలో పర్యటించాలన్నారు. గర్భిణులు, అనారోగ్యంగా ఉన్న వారిని వెంటనే తరలించాలని చెప్పారు. పాత వీడియోలతో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై దృష్టిపెట్టాలని.. తప్పుడు ప్రచారంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ అంశంపై దృష్టి సారించాలని చెప్పారు.

పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... కొండ చరియల ముప్పు ఉన్న ప్రాంతాల్లో 365 ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న 7 ఇండ్లను గుర్తించినట్లు చెప్పారు. ఆ ఇళ్లలోని ప్రజలను ఒప్పించి పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. వాగులు, వంకలు పొంగినప్పుడు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోప్‌లు కట్టాలని చెప్పారు. డ్రోన్లను వినియోగించాలని, అవసరమైన ట్రాక్టర్లు, జెసిబిలను ముందే సమకూర్చుకోవాలని సూచించారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఖాళీ చేసిన ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొండ ప్రాంతాలు, బుడమేరుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. సమిష్టి కృషితో తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ (జేసీ) ఎస్.ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కే ఆర్ సి సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, డిసిపిలు సరిత, తిరుమలేశ్వర్ రెడ్డి, ఉమామ హేశ్వరరాజు, ఏసీపీ భానుప్రకాశ్‌రెడ్డి, ఏసీపీ పావన్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావితాన్ని ఎదుర్కోవడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలి



(మొదటిపేజీ తరువాయి)

సందర్శించి అక్కడ చేపట్టిన తుఫాను సహాయక ఏర్పాట్లను పరిశీలించారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తుఫాన్ కంట్రోల్ విభాగం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తుఫాను సహాయక ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క ప్రాణ నష్టము జరగకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సిబ్బంది అందరు కూడా వారి వారి ప్రధాన కార్య స్థానాల్లో అందుబాటులో ఉండాలన్నారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అందుకు తగ్గట్టుగా తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మంచినీరు ఎక్కడ కూడా కలుషితం కాకుండా చూడాలని అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడైనా రహదారి మార్గాల్లో చెట్లు గాని, విద్యుత్ స్తంభాలు గాని పడిపోతే రాకపోకలకు అంతరాయం కలగకుండా వెంటనే వాటిని తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సౌకర్యాన్ని కూడా వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఇందుకోసం అవసరమైన విద్యుత్ రంపాలను, క్రేన్లను తదితర యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మోంత తుఫాను వలన జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 28వ తేదీన తుఫాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురు గాలులు వీచడంతోపాటు బీభత్సమైన వర్షము కురుస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం గ్రామ, మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అందరినీ అప్రమత్తం చేశామన్నారు. లోతట్టు ప్రాంతాలు, కాలువ గట్లు, పూరిల్లు, తాటిపాకలు పెంకుటిల్ల లో నివసిస్తున్న ప్రజలను వెంటనే తుఫాను వలన ఇబ్బంది కలగకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆ ఏర్పాట్లు ఎలా ఉన్నాయో పరిశీలించేందుకు జిల్లా ఎస్పీతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీలలో అన్ని విద్యాసంస్థలకు సెలవు దినాలుగా ప్రకటించామని ప్రజలందరూ వారి ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని ఎవరు కూడా బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పూరిల్లు, పాకలు, బలహీనమైన ఇళ్లల్లో ఉండే వారు వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు స్వచ్ఛందంగా రావాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎవరికి ప్రాణం నష్టం జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. పునరావాస కేంద్రాలలో మంచినీరు ఆహారంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు మాట్లాడుతూ ఈనెల 28 వ తేదీన తుఫాన్ ప్రభావం జిల్లాలో ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రధానంగా ఎక్కడైతే కరకట్టలు దెబ్బతినే అవకాశం ఉందో, ఇల్లు పడిపోవడానికి ఆస్కారం ఉందో వాటిపైన ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అటువంటి వాటిని గుర్తించి ఈ సోమవారం సాయంత్రానికి అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవిన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. సముద్రంలో ఆటుపోట్లు సాధారణంగా ఉంటాయని సముద్రం ముందుకు రావడం కూడా జరుగుతుందన్నారు సముద్రం నీరు గ్రామాల్లోకి రాకుండా పోలీసు సిబ్బందినీ నియమించే ఏర్పాటు చేస్తామ ప్రజలు ఎవరూ కూడా బీచ్ (సముద్ర తీర ప్రాంతాలు) దగ్గరికి రావద్దని ఇప్పటికే ప్రజలకు తెలియజేశామన్నారు. జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని మత్యకారులు ఎవరూ కూడా సముద్రంలో చేపల వేటకు వెళ్ళరాదని ఇప్పటికే చెప్పడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ ఎస్పీ వెంట గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, పెడన నియోజకవర్గ ప్రత్యేక అధికారి మార్క్‌ఫెడ్ జీఎం మురళీ కిషోర్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజు, డి ఎల్ డి ఓ పద్మ, తహసిల్దారులు ఎంపీడీవోలు, జల వనరులు తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ : మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తుపాను జోనల్ ప్రత్యేక అధికారి, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్‌తో కలసి మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో సంభవించనున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు.జిల్లాలో తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందుగానే లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, డయాలసిస్ పేషెంట్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పునరావాస కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు బిస్కెట్లు, బ్రెడ్లు, తాగునీరు ఎక్కువమొత్తంలో నిల్వ చేసుకోవాలని, అవసరమైన ఔషధాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజులు ప్రజలందరూ ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండేలా దండోరా వేయించి అప్రమత్తం చేయాలని, వారు ముందుగానే నిత్యవసర సరుకులు నిల్వ చేసుకోవాలని, కొవ్వొత్తులు, టార్చ్ లైట్లు, బ్యాటరీ బ్యాక్ లు సిద్ధంగా ఉంచుకునే విధంగా క్షేత్రస్థాయి అధికారుల ద్వారా అప్రమత్తం చేయాలన్నారు. కాజువేలపై ఎలాంటి వాహనాల రాకపోకలను అనుమతించవద్దని, బీచ్ ల వైపు సందర్శకులెవరినీ అనుమతించకుండా పోలీసు అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పట్టణ ప్రాంతాలలో రహదారులు, డివైడర్ల పైన ఉన్న హోర్డింగులు వెంటనే తొలగించాలన్నారు. అధిక వర్షాలతో డ్రైనేజీలు పొంగిపొర్లుతాయని, అడ్డంకులను తొలగించేందుకు జెసిబి లు వంటి వాహనాలు ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సాధారణ మొబైల్ ఫోన్ల సిగ్నల్స్ సమస్యను అధిగమించేందుకు అదనంగా శాటిలైట్ ఫోన్లను పొంది వినియోగించాలని జిల్లా యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, బందరు ఆర్డీఓ కే స్వాతి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మోహన్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, పశు



, మత్స్య, విద్యుత్, ఆర్ అండ్ బి, వ్యవసాయ శాఖల అధికారులు చిన్న నరసింహులు, అయ్యా నాగరాజా, సత్యానంద్, లోకేశ్వరరావు, ఎన్ పద్మావతి, డిపిఓ డాక్టర్ జె అరుణ, డీఎంహెచ్వో డాక్టర్ యుగంధర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సీవీఎస్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ అవగాహన'



**విజయవాడ మేజర్ న్యూస్ :** విద్యార్థులకు కంటి ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'సీవీఎస్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ అవగాహన' పేరుతో ఒక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు విజయవాడ మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్స్, కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ స్వాతి పిన్నమనేని తెలిపారు. ఈ మేరకు జరిగిన అవగాహన సభలో ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థులలో పెరుగుతున్న కంప్యూటర్ విజన్ సింగ్రోమ్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ అనగా అధిక స్క్రీన్ వినియోగం, మారుతున్న జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. యువతలో సర్వసాధారణంగా మారుతున్న కంటి సమస్యలను ఇందులో హైలెట్ చేస్తూ, ముందుగానే కంటి సమస్యలను గుర్తించడం, కంటి సంరక్షణ, ఆరోగ్యకరమైన స్క్రీన్ అలవాట్ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఈ ప్రచారం ద్వారా, మ్యాక్సివిజన్ 10 కళాశాలల్లో 5,000 మందికి పైగా విద్యార్థులకు చేరుకోవాలని యోచిస్తోందన్నారు. వారు తమ కంటి చూపును కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, శిక్షణ పొందిన ఆప్టోమెట్రిస్టులు, టెక్నీషియన్లు అధునాతన రోగనిర్ధారణ సాధనాలను ఉపయోగించి క్యాంపస్‌లలోనే కంటి పరీక్షలను నిర్వహిస్తామని, విద్యార్థులు తమ కంటి ఆరోగ్యాన్ని తెలుసుకుని అవసరమైతే సకాలంలో వైద్య సంప్రదింపులు పొందడానికి వీలుగా పరీక్షా ఫలితాలు వారితో పంచుకోబడతాయన్నారు. డిజిటల్ స్క్రీన్ వినియోగం పెరగడంతో, చాలా మంది యువతలో గుర్తించని దృష్టి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ ప్రచారం ద్వారా, విద్యార్థులలో మెరుగైన కంటి ఆరోగ్యం కోసం అవగాహన, నివారణ సంరక్షణను ప్రోత్సహించాలని మ్యాక్సివిజన్ లక్ష్యంగా పెట్టుకుంది"అని అన్నారు. ఈ కార్యక్రమం, మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ సామాజిక సేవ (కమ్యూనిటీ ఔట్రీచ్), కంటి సంరక్షణ పట్ల నిబద్ధతను నొక్కి చెబుతుంది. తద్వారా, రాబోయే తరానికి వారి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వడానికి వీలు కల్పిస్తుందన్నారు.

## రూ.445 కోట్ల విలువైన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌తో ఒక గొప్ప మైలురాయిని చేరుకున్న క్రాంప్టన్

Crompton

**విజయవాడ మేజర్ న్యూస్ :** క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, గృహ, ఇంధన పరిష్కారాలలో విశ్వసనీయ అగ్రగామి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గణనీయమైన సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌ను పొందడం ద్వారా తన సోలార్ ప్రయాణంలో ప్రధాన మైలురాయిని సాధించింది. ఈ ఆర్డర్ సమీప కాలంలో 2 కిలోవాట్ల ఆన్-గ్రిడ్ రూఫ్‌టాప్ వ్యవస్థలతో 40,000 గృహాలను కవర్ చేయడం ద్వారా, సౌరశక్తిని అందిస్తుంది, దీని మొత్తం కాంట్రాక్ట్ విలువ రూ. 445 కోట్లు. 77 మెగావాట్ల విలువైన ఈ మైలురాయి ఆర్డర్ మొత్తం రూ. 445 కోట్లు, ఇది క్రాంప్టన్ యొక్క అతిపెద్ద సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్‌గా నిలుస్తూ, సోలార్ విభాగంలో ప్రవేశించిన కేవలం రెండు నెలల్లో-సంస్థ యొక్క వేగవంతమైన రాంప్-అప్‌ను నొక్కి చెబుతుంది. ఈ నెల ప్రారంభంలో సాధించిన రూ.52 కోట్ల ఆర్డర్, క్రాంప్టన్ యొక్క బలమైన మార్కెట్ ట్రాక్షన్, అమలు సామర్థ్యం, సోలార్ విభాగంలో వేగవంతమైన వృద్ధిని స్పష్టంగా చూపిస్తుంది. సోలార్ రూఫ్‌టాప్ విభాగం భారీగా, వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌ను సూచిస్తుంది, దీని విలువ సుమారు రూ. 20,000-25,000 కోట్లు, ప్రతి సంవత్సరం సుమారు 20% వృద్ధి చెందుతుందని అంచనా. మెరుగైన సాంకేతికత, సులభమైన గ్రిడ్ సమైక్యత, పెరుగుతున్న అవగాహన, వ్యవస్థల ఖర్చుల తగ్గుదల వంటి కారకాలతో, సోలార్ రూఫ్‌టాప్ పట్ల ప్రజల ఆసక్తి రోజురోజుకి పెరుగుతోంది. ఈ పరిణామాలు క్రాంప్టన్‌కు గృహాల్లో స్థిరమైన ఇంధన పరిష్కారాలను విస్తరించి, పెరుగుదల సాధించడానికి బలమైన అవకాశాలను అందిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ గృహాలను నమ్మదగిన, స్థిరమైన, సులభంగా నిర్వహించదగిన సోలార్ పరిష్కారాలతో సమీకరిస్తుంది. క్రాంప్టన్ యొక్క ఎండ్-టు-ఎండ్ మద్దతు, శిక్షణ పొందిన సిబ్బంది, ప్రతిస్పందించే సేవా నెట్‌వర్క్ వల్ల, వేలాది ఇళ్లలో అంతరాయలేని పనితీరును నిర్ధారిస్తుంది. ఈ భారీ విస్తరణ క్రాంప్టన్ యొక్క అమలు సామర్థ్యాన్ని హైలైట్ చేస్తుంది, వినూత్న, నమ్మదగిన ఇంధన పరిష్కారాలను అందించడంలో విశ్వసనీయ, ఇంధన-సేవా కేంద్రబద్ధమైన బ్రాండ్‌గా దాని స్థానం మరింత బలోపేతం అవుతుంది. ఈ ఆర్డర్ గురించి మాట్లాడుతూ, మిస్టర్. ప్రోమీత్ ఘోష్, మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఒ, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ ఇలా అన్నారు, "ఈ మైలురాయి సోలార్ రూఫ్‌టాప్ ఆర్డర్ రూ. 445 కోట్లు, క్రాంప్టన్ పునరుత్పాదక ఇంధన ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది భారతదేశం యొక్క స్వచ్ఛమైన ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున, స్థిరమైన పరిష్కారాలను అందించే మా సామర్థ్యంపై పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో మేము మా ఉనికిని విస్తరిస్తున్నప్పుడు, వినియోగదారులు, సమాజాలకు దీర్ఘకాలిక విలువను సృష్టించడానికి ఆవిష్కరణ, సామర్థ్యం, బాధ్యతాయుతమైన వృద్ధి మీద మా దృష్టి ఉంది. ఈ విజయం దేశవ్యాప్తంగా స్థిరమైన గృహ ఇంధన పరిష్కారాలను ముందుకు తీసుకెళ్లడానికి మా నిబద్ధతను మరింత బలపరుస్తుంది."

# గుడ్లవల్లేరులో మొంథా తుఫాను ముందస్తు చర్యలు



### 6 తుఫాను పునరావాస కేంద్రాల ఏర్పాటు

### గ్రామాల్లో, మండలంలో కంట్రోల్ రూములు

### పర్యవేక్షిస్తున్న మండల, గ్రామ అధికారులు

**గుడ్లవల్లేరు అక్టోబరు 27 మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను ముందస్తు చర్యల్లో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసారు. కౌతరం జడ్పీ హైస్కూల్, వడ్లమన్నాడు జడ్పీ హైస్కూల్, గుడ్లవల్లేరు ఎస్ ఇ ఆర్ ఎం జూనియర్ కాలేజ్, అంగలూరు జెడ్పీ హైస్కూల్, విన్నకోట జెడ్పీ హైస్కూల్, డోకిపర్రు గవర్నమెంట్ హైస్కూల్ లలో ఏర్పాటు చేయబడ్డాయి. ఈ పునరావాస కేంద్రాలను సోమవారం ఉదయం మండల అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్, తహసీల్దార్ బి.లోకరాజు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్ వి వి సత్యనారాయణ లు సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులు ఎజెఎల్ నరసింహారావు, రమణలు, విఆర్వో లు ప్రకాష్, వెంకన్న, భాస్కర్ మల్లికార్జున, నాగరాజు లు, సచివాయ ఉద్యోగులతో కలసి మండలంలోని గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు, కౌతరం, అంగలూరు, విన్నకోట, డోకిపర్రు తదితర గ్రామాలను సందర్శించి, పరిస్థితులు పరిశీలించారు. గ్రామస్థులకు తుఫాను ప్రభావతపై, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తూ, ధైర్యంగా వుండాలని అత్యవసర పరిస్థితుల్లో మండల పరిధిలో మొత్తం పదిహేడు సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో నిరంతరం కొనసాగించబడుతున్న కంట్రోల్ రూము ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు ఎల్ లోహిత, బి.వాసవిలను ఫోన్ నెంబర్లు 6281436245, 8106272847 లకుబీ మధ్యాహ్నం 2 నుండి రాత్రి 10 గంటల వరకు కె.జగదీష్, కె.రఘులను ఫోన్ నెంబర్లు 9553752134, 9014743111 లకుబీ రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.భాగ్యరాజ్, కె.వెంకటేశ్వరరావు 7989137301, 9398858058 లకు సమాచారం అందించవలసిందిగా ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్, తహశీల్దార్ బి.లోకరాజు లు కోరారు. అదేవిధంగా విఆర్వో లు, పంచాయతీ కార్యదర్శులు నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.





## మేక్‌మైట్రిప్ ట్రావెల్ కా ముహూరత్ ప్రారంభం

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ ఆన్లైన్ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్, భారతీయుల సంవత్సరాంత ప్రయాణ సీజన్ ప్రారంభానికి గుర్తుగా రూపొందించిన కొత్త క్యాలెండర్ మూమెంట్ 'ట్రావెల్ కా ముహూరత్'ను ప్రారంభించిందని ప్రకటించింది. ఇందులో భాగంగా, విమానాలు, హోటల్ వసతులు, హాలిడే ప్యాకేజీలు, గ్రౌండ్ ట్రాన్స్‌పోర్ట్, పర్యటనలు, ఆకర్షణలు వంటి సేవలతో పాటు వీసా, ఫారెక్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి ప్రయాణ నిత్యావసరాలను కూడా కలిపి, భారతదేశం, విదేశాలలోని ప్రముఖ విమానయాన సంస్థలు, హాస్పిటాలిటీ బ్రాండ్లు, ప్రధాన బ్యాంకింగ్ భాగస్వాములతో కలసి ప్రయాణికులకు అత్యున్నత విలువను అందిస్తోంది. 'ట్రావెల్ కా ముహూరత్' ప్రారంభ ఎడిషన్ ఈ నెల 29 నుండి నవంబర్ 30, వరకు జరుగుతుంది. ఎంఎంటీబ్లాక్ సభ్యులు ప్రత్యేక ముందస్తు యాక్సెస్‌ను పొందగలరని, ప్రతి శుక్రవారం బ్లాక్ ఫ్రైడే డీల్స్, లైట్నింగ్ డ్రాప్స్, పరిమిత ఇన్వెంటరీ ఆఫర్‌లు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని మేక్‌మైట్రిప్ ప్రకటించింది.

## తీర గ్రామాల్లో ముంపు సమస్య రాకుండా చూడాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** మొంథా తుఫాన్ నేపథ్యంలో తీర గ్రామాల్లో ముంపు సమస్య తలెత్తకుండా డ్రైనేజీలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో డ్రైనేజీ శాఖ ఈఈ బి.కిరణ్ బాబుతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీర గ్రామాలతో పాటు నియోజకవర్గంలో ఎక్కడా ముంపు సమస్య రాకుండా క్షేత్ర స్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రైనేజీల్లో వలకట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈ జే.బాబూ నాయక్, ఏఈఈ చిరంజీవి పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాలను సిద్ధం చేయండి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని డ్వామా పిడి శివ పసాద్ యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ను ఎదుర్కొనేందుకు మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని రానున్న విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. ఇందుకోసం తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అందులో పూరి ఇళ్లల్లో, రేకుల ఇళ్లలో నివాసముండే వారిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మండలంలో 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా అవనిగడ్డ లోని ఐదు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో అవనిగడ్డ బాలికలు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిధిలోని వేకనూరు, అశ్వరావు పాలెం, పులిగడ్డ, దక్షిణ చిరువోలు లంక గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 120 గృహాలకు చెందిన 370 మందిని పునరావాస కేంద్రాలకు తరలించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క రిహాబిటేషన్ సెంటర్ కు ఒక ఇన్చార్జిని నియమించడంతో పాటు, తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు మండలం మొత్తం పర్యవేక్షిస్తారని తెలిపారు. వీరంతా బాధితులకు భోజనం, వసతి, శానిటేషన్, తాగునీరు, మెడికల్ క్యాంపులు, అన్ని రకాల సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పిడి చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం మరియాదేవి, తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు, సిఐ జి.యువ కుమార్, ఎస్సై కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, భానుమూర్తి, నిరంజన్ లను సన్మానించిన బిసి సంఘం నాయకులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, డిప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్.ఎం.ఓ నిరంజన్‌లను కృష్ణాజిల్లా బీ.సీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. గతంలో బీ.సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం ఎం.ఆర్.ఐ స్కానింగ్ విభాగంలో రోగి రోగికి వ్యత్యాసం చూపిస్తూ ధరలు వసూలు చేయడం, నగదు జమ చేయించుకుని రసీదులు ఇవ్వకపోవడం, బ్లడ్ శాంపిల్ కలెక్షన్‌కు టోర్నీ కిట్లు వాడకపోవడం వంటి సమస్యలపై డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్.ఎం.ఓ లకు వినతి పత్రం సమర్పించారు. పైన తెలిపిన సమస్యలపై సత్వర చర్యల్లో భాగంగా వెంటనే ఎం.ఆర్.ఐ స్కానింగ్ ధరలు పట్టికను సంబంధిత విభాగం వద్ద ఏర్పాటు చేయడం. నగదు జమకు రసీదులు అందజేయడం. రక్త సేకరణకు టోర్నీ కిట్లను అందజేయడం వంటి చర్యలను సత్వరమే తీసుకుని సమస్యలను పరిష్కరించినందుకు సుబ్రమణ్యం కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సూపర్ ఇంటెండెంట్,డిప్యూటీ సూపర్ ఇంటెండెంట్, ఆర్. ఎం.ఓ లను పుష్ప గుచ్చాలు, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జన్ను గోవిందు, భోగి రెడ్డి సుభాని, నిక్కు రాధాకృష్ణ, ధనికొండ చిన్ని, ఎం. రామరాజు, ఎం.గోపి, రత్తయ్య బీసీ నాయకులు పాల్గొన్నారు.

## తుపాన్ షెల్టర్, మెడికల్ క్యాంపులో పర్యటించిన గొపు సత్యనారాయణ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మొంథా తూపన్ ప్రభావం ఉన్నందున కానూరు గ్రామములో హై స్కూల్‌లో షెల్టర్, మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, జి కానూరు, చిన్న కానూరు, వన్నారు కానూరు సారంగి పాలెం, పెద్ద కానూరు గ్రామములను సందర్శించి గ్రామస్తులుకు తగు సూచనలు తెలిపి పునరావాస కేంద్రము వద్దకు తరలి రావాలి అని సూచించారు. తూఫాన్ విపత్తు ఎదుర్కోవడానికి తగు సూచనలు తీసుకోవాలి అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హరి, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్బయ్య దాసు,పీత రాము, మోపిదేవి కృష్ణ మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, మెడికల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ కారణంగా ప్రాణహాని జరగకుండా చూడండి





**పామర్రు మేజర్ న్యూస్:** మొంథా తుఫాను వలన ఏ ఒక్కరికి ప్రాణహాని జరగరాదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పామర్రు నియోజకవర్గం పామర్రు మండల కేంద్రంలోని కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై తుఫాను ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని పూరిళ్ళు, పాత ఇళ్ళు, పడిపోయే ఇళ్లపై దృష్టి కేంద్రీకరించి అందులో నివసించే వారందరినీ పునరావాస కేంద్రంలోకి సురక్షితంగా తరలించాలన్నారు. ఏ ఒక్కరికి ప్రాణహాని జరగరాదని స్పష్టం చేస్తూ ఏ ఒక్కరు కూడా ప్రమాద స్థలాలలో మిగిలిపోకుండా నూటికి నూరు శాతం అందరిని తప్పనిసరిగా పునరావాస కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. అన్ని మంచినీటి జలాశయాలను నీటితో ముందుగానే నింపుకోవాలని, మంచి నీటి కొరత రాకుండా చూడాలని అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తుఫాను వలన భారీ వర్షంతో పాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని దాంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందన్నారు. వాటిని వెంటనే తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ రంపాలు, క్రేన్లు వంటి యంత్ర పరికరాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ అంతరాయం కాకుండా చూడాలన్నారు. పునరావాస కేంద్రంలో మంచినీరు, నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, వంటవాళ్లను ముందుగా మాట్లాడుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచి ఆహారం అందించాలన్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ఎప్పటికప్పుడు మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్ డి ఓ బి.ఎస్. హేలా షారోన్, డి ఎల్ డి ఓ రాజేష్, గృహ నిర్మాణ సంస్థ ఈఈ వెంకటరావు, తహసిల్దారు జి.రవికాంత్, ఎంపీడీవో కె. జ్యోతి, విద్యుత్ శాఖ డిఇఇ కె.సుందరరావు తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పట్ల గ్రామ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

## సర్పంచ్ సీతయ్య



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** కోస్తా తీరాన్ని తాకనున్న అతి తీవ్ర తుఫాను మెంత నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య సూచించారు. సోమవారం ఉదయం తుఫాను ముందస్తు ఏర్పాట్లపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ తీవ్ర తుఫాను కారణంగా పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని అన్ని మండల కేంద్రాల్లో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసింది. గ్రామ ప్రజలకు ఏదైనా విపత్తు ఎదురైతే వెంటనే సర్పంచ్ సీతయ్య తన ఫోన్ నెంబర్‌కు (9848081279) ఫోన్ చేయవలసిందిగా తెలియజేసారు.సదా మీ సేవలో స్పందించేందుకు పంచాయతీ సిబ్బందితో పాటు రెవిన్యూ అధికారులు కూడా సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ భరోసా ఇచ్చారు. సోమవారం నుండి మూడు రోజుల పాటు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని, కూరగాయలు, పాలు, నిత్యావసర సరుకులు, అత్యవసర మందులు కొనుగోలు చేసుకోవాలని,అలాగే పశువులు మన గ్రామంలో ఎక్కువగా ఉన్నందున వాటిని పల్లపు ప్రాంతాలనుండి మేరకు ప్రాంతాలకు తరలించాలని సర్పంచ్ సీతయ్య విజ్ఞప్తి చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షితం గా ఉండాలని చెప్పారు. వర్షాలు పడుతున్నప్పుడు పిడుగులు పడే ప్రమాదం ఉందని చెట్ల కిందకి వెళ్ళవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉందని తెలిసిన వెంటనే తగు సమాచారాన్ని తనకు తెలియజేయాలని అంబాపురం సర్పంచ్ సీతయ్య కోరారు.

# తీర ప్రాంతాలలో పర్యటించిన జిల్లా ప్రత్యేక అధికారి కాట ఆమ్రపాలి







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జిల్లాకు నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి, పర్యాటక శాఖ ఎండి, కాట ఆమ్రపాలి సోమవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి మండలంలోని గరాలదిబ్బ, గిలకలదిండి గ్రామాలలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. కేంద్రంలో ఆశ్రయం పొందిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రంలో ఉన్న గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వృద్ధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మంగినపూడి బీచ్ ను సందర్శించి అక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బీచ్ వద్ద మీడియాతో మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావంతో 27 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే, సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించామన్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 188 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలందరిని తరలిస్తున్నామని తెలిపారు. సమాచార నిమిత్తం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని, మండల ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా రైతులెవ్వరు కూడా కోతలు కోయకుండా వాయిదా వేసుకునేలా అప్రమత్తం చేయడం జరిగిందని, ఒకవేళ ఎవరైన ఇప్పటికే కోత కోసి ఉంటే గనక ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు దానిపై ఉప్పు ద్రావణం పిచికారీ చేసేవిధంగా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. తుఫాను ముగిసేంతవరకు ప్రజలెవరూ ఇళ్ళ నుండి బయటకు రాకుండా తమ ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని కోరుతూ, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలను కోరారు. తొలుత, జిల్లా పర్యటన నిమిత్తం కలెక్టరేట్కు విచ్చేసిన జిల్లా ప్రత్యేక అధికారికి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు మొక్కను అందించి స్వాగతం పలికారు.బందరు ఆర్డీవో కే స్వాతి, పర్యాటకశాఖ జిల్లా అధికారి జి. రామలక్ష్మణరావు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మచిలీపట్నం సౌత్ తాసిల్దార్ మధుసూదనరావు తదితరులు వారి వెంట ఉన్నారు.

# ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం..

**అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మొంథా తుపాను నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం తెలిపారు. బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం రాత్రికి తుఫానుగా బలపడుతుందన్నారు. దీని ప్రభావంతో భారీ-అతిభారీవర్షాలు కురుస్తాయని, ఈదురుగాలులు వీస్తాయని ప్రజలంతా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలతో ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి గ్రామస్థాయి నుంచి కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

మైలవరం నియోజకవర్గంలో గతంలో సంభవించిన ఆకస్మిక వరదలను దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను ముప్పు తొలగిపోయే వరకూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్ష తీవ్రత, తుఫాను ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం నేరుగా ప్రజలకు తెలియ జేస్తోందన్నారు. విద్యుత్తు, తాగునీరు, రవాణా సేవలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అవసరం అయితే వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించి, అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పించాలన్నారు. బుడమేరు ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి**

మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప దూర ప్రాంత ప్రయాణాలు చేయవద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి. విద్యుత్తు తీగలు, స్తంభాలు, నియంత్రికల వద్దకు వెళ్లవద్దు. చిన్న పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. వృద్ధులు, రోగులు, గర్భిణులను సురక్షిత ప్రదేశాల్లో ఉంచండి. చెట్లు, కంచెలు, గోడలు కూలే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వంలో సాగర్ 3వ జోన్‌కు సాగునీటి విప్లవం



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 3వ జోన్ కు ఆగస్టులోనే సాగర్ వరద జలాలు రావటం సాగునీటి విప్లవమని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం సాగర్ వరద జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేసిన నేపథ్యంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ పరిధిలోని బాపులపాడు మేజర్ చివరి ఆయకట్టుకు చేరుకున్న నేపథ్యంలో సోమవారం ఉదయం బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామంలో బాపులపాడు మేజర్ 14వ కిలోమీటర్ దిగువున కోమటికుంట చెరువు, తుమ్మలకుంట చెరువుకు విడుదలవుతున్న సాగర్ జలాలను నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మల్లవల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి రాంబాబు, నూజివీడు ఎన్.ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. సీతారావమ్మ, రంగన్నగూడెం ఉప సర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావుతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ గన్నవరం మ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విశేష కృషి వలన నియోజకవర్గంలోని చిట్ట చివరి ప్రాంతమైన బాపులపాడు మేజర్‌కు సాగర్ వరద జలాలు పూర్తిస్థాయిలో వచ్చాయని ఈ నీటిని వృధా కాకుండా ఆయకట్టు దారులు సద్వినియోగం చేసుకొని చెరువులను నింపుకొని భూగర్భ జలాలను పెంపొందించడానికి కృషి చేయాలని సూచించారు. ఇప్పటివరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ లో 250 పై చిలుకు చెరువులను సాగర్ వరద జలాలతో నింపడం జరిగిందని బాపులపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఎగువన ఉన్న 15 చెరువులను సాగర్ వరద జలాలతో నింపడం జరిగిందని ఇంకా ఆయకట్టు లోని రేమల్లె, వేలేరు నీటి సంఘాల పరిధిలో చెరువులు నింపవలసి ఉందని కాలువ ఎగువ బాగాన ఉన్న సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు యూటీల దగ్గర నీటి వృధాని అరికట్టి వరద జలాలు చివర ప్రాంతానికి చేరుకోవటానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయకట్టులో రాబోయే రెండు రోజుల్లో మొంతా తుఫాన్ తో అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున నీటి సంఘాల అధ్యక్షులు, ఆయకట్టుదారులు అప్రమత్తంగా ఉండి చెరువులకు, కాలువలకు గండ్లు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగన్నగూడెం నీటి సంఘం ఉపాధ్యక్షులు బత్తుల సాంబశివరావు, నీటి సంఘాల ప్రతినిధులు అక్కినేని ధర్మరాజు, మరీదు వీరాంజనేయులు, అక్కినేని కృష్ణాజి, చలమాల శేషయ్య, తమ్మిశెట్టి రంగారావు, అక్కినేని సత్య ప్రసాద్, ఎన్.ఎస్.పి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చల్లపల్లిలో అధికారుల ముందస్తు చర్యలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు చల్లపల్లి మండలంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముం దు జాగ్రత్త చర్యగా ప్రతి గ్రామంలో ఒక పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. మండలంలో 11 కేంద్రాలను ప్రారంభించి అధికారుల బృందం సహాయక చర్యలకు సిద్ధంగా విధుల్లో ఉన్నారు. భారీ వర్షాలు, బలమైన గాలులు ప్రారంభమైతే తుఫాను ప్రభావిత ప్రజలను తరలించేందుకు వీలుగా కేంద్రాలను సిద్ధం చేశారు. తుఫాను తీవ్రత ఉంటే చల్లపల్లి, ఆముదార్లంక, మాజేరు, లక్ష్మీపురం గ్రామాలలో సుమారుగా 400 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వస్తుందని అంచనావేశారు. సోమవారం సాయంత్రం వరకు భారీవర్షం, ఈదురుగాలులు లేకపోవటంతో ఎవరినీ కేంద్రాలకు తరలించలేదు. గ్రామాల్లో ఎం పికచేసిన ఆయా పునరావాస కేంద్రాలను తహసీల్దార్ డి.వనజాక్షి, సీఐ కె.ఈశ్వరరావు, ఎంపీడీవో ఆనం దకుమారి, ఎస్ఐ పిఎస్ వి.సుబ్రహ్మణ్యాలు పరిశీలించి కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బందికి సూచనలు అందించారు, గ్రామాల్లో పరిస్థితిని అధికారులతో సమీక్షించారు.

**ఆందోళనలో రైతాంగం**

తుఫాను ప్రభావం సోమవారం మధ్యాహ్నం నుంచీ ప్రారంభమైనప్పటికీ తేలికపాటి వర్షమే కురుస్తూ ఉంది. ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతంగా మారగా, మధ్యాహ్నం నుంచీ వర్షం కురవటం ప్రారంభమైంది. తేలికపాటి జల్లులతో వర్షం కురుస్తూ ఉండగా, చలిగాలులు, చలితీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ప్రస బితానికి ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు లేనప్పటికీ తుఫాను తీవ్రత ఎలా ఉంటుందో అన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. రైతాంగం తీవ్ర ఆవేదనలో మునిగారు. వరిపొలాలు పాలుపోసుకునే దశలోనూ, గింజ తయారీదశలోనూ ఉండటంతో వర్షం, గాలులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని రైతులు ఆందోళన చెం దుతున్నారు. వర్షపు జల్లులు కురుస్తూనే ఉండటంతో జనజీవనం స్తంభించింది. వారపుసంతకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది.



## ఆసరా కోల్పోయిన ఇస్లావత్ దుర్గమ్మకు అండగా నిలిచిన లంక లితీష్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలోని సుగాలి తండాలో దీపావళి పండుగ రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ఇస్లావత్ దుర్గమ్మకు తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ అండగా నిలిచారుఈ సందర్భంగా ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన దుర్గమ్మకు మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందచేశారుఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు,తెలుగు యువత పాల్గొన్నారు.

## వైసీపీ యువనాయకుడు ఆర్.కె జన్మదిన వేడుకలు



**గన్నవరం (ఉంగుటూరు), అక్టోబర్ 27, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం నందమూరులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడు, వైయస్సార్ సీపీ యువనాయకుడు సలివేంద్ర రామకృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో రామకృష్ణ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేయడం ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ స్ఫూర్తితో నా పుట్టినరోజున ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ఈసారి అభిమానులు వివిధ ప్రాంతాల్లో యాచకులు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు,అనాధ బాలలతో కలిపి 400 మందికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. యువత పెద్దలను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ సేవాకార్యక్రమాలు చేయాలన్నారు. భావితరాలకు ఆదర్శంగా యువత తమతమ రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ అభిమానులు, వైయస్సార్ సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మానవత పెదన శాఖ ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధి భాదితునికి ఆర్థిక సాయం



**పెదన, గూడూరు, మేజర్ న్యూస్ :** మండలం, కప్పలదొడ్డి గ్రామ చేనేత కార్మికుడు నున్న శివరావు రెండు కిడ్నీలు పాడయి పనిచేయడానికి శరీరం సహకరించక అనేక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న శివరావుకు వైద్యఖర్చుల నిమిత్తం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అతనికి 6వేలు రూపాయల నగదును ఆర్థిక సహాయం కింద అందించామని ఆ సంస్థ అధ్యక్షుడు పేరిశెట్టి నాగరవి తెలిపారు. ఈ మేరకు నాగ రవి తన సంస్థ సభ్యులతో కలిసి వ్యాధిగ్రస్తుని ఇంటి వద్ద నగదును అందించారు. ఈ సందర్భంగా నాగరవి ఒక ప్రకటనలో మాట్లాడుతూ శివరావు కుటుంబ సభ్యులు తమకు తెలుసుననీ మానవత ద్వారా నేడు చేసేసాయం వైద్యులు చూసించినట్లుగా మందులకు మాత్రమే ఈసదుపాయం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మట్టా రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడమే మానవతా సేవా సంస్థ లక్ష్యంగా పనిచేస్తుందని మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ సహాయం అవసరమైన వారిని తప్పకుండా ఆదుకోవాలని కోరారు. ఛైర్మన్ అనుముకొండ గౌరీ ప్రసాద్ మాష్టారు మాట్లాడుతూ నేడు మేము చేసే సహాయం ద్వారా శివరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సహాయం చేయగలిగిన స్థితిలో ఉన్న ప్రతిఒక్కరూ ఆపదలో ఉన్నవారికి సాయం చేసి మానవత్వం చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో - ఛైర్మన్ ఊటుకూరి సుబ్బారావు,కన్వీనర్ బెల్లంకొండ లక్ష్మణ్, ఇ సి మెంబర్ ఖుర్షీద్ బేగం,సభ్యులు బూసం సాయి బాబు,బళ్ళ నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు ఆర్థిక సాయం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలం కేంద్రంలో గ్రామానికి చెందిన అన్నం సత్యనారాయణ కుమారుడు అన్నం నాగరాజు అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయలు మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు వెంకటేశ్వరావు (బుల్లి), అందజేసి, పజ్జూరు జగన్ శాంతి నగర్ నుచి మార్చురీ బాక్స్ తెప్పిచి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజవాడ గణపతి రావు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది

### నియోజకవర్గ ప్రజలకు సూచించిన బూరగడ్డ



**పెడన, గూడూరు, మేజర్ న్యూస్:** తుఫాన్‌కు ముందు రాష్ట్ర ప్రభుత్వం పలు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని, రైతులు ప్రజలు ఎవరు కూడా అధైర్య పడవద్దు అని తమను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం అన్న ఏర్పాట్లు చేసిందని ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేద వ్యాస్ అన్నారు. ఈ మేరకు తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆయన గూడూరు మండలంలోని పలు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కంకటావ పంచాయతీ కత్తిరెడ్డి పాలెంలో పర్యటించిన ఆయన శిదిలావస్తకు చేరిన వంతెనను పరిశీలించామన్నారు. కాలువల కట్టలు తెగకుండా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించామని పేర్కొన్నారు. అలాగే అంటూ రోగాలు ప్రబలకుండా సక్రమంగా పారిశుధ్య నిర్వహణ జరిపి పంచాయతీలు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈదురుగాలి వల్ల విద్యుత్తుకు అంతరాయం కలిగిన వెంటనే పునరుద్ధించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కమ్యూనికేషన్ లోపించిన వెంటనే దగ్గరలో ఉన్న సచివాలయ అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు.

## అలినఖిపాలెంలో సంతకాల సేకరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధి లోని అలినఖిపాలెం గ్రామంలో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాలమేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి గొరికిపూడి బుజ్జి, కనుమూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్లా అజీజ్, రైతు విభాగం నాయకులు మర్రి బాబురావు, స్థానిక ఎంపిటిసి సభ్యుడు మీర్జా సజాద్ అలీ, గుర్విందపల్లి వంశీ, అబ్బాస్ అలీ, మెకానిక్ అలీ, వైసిపి నాయకులు బాసు రమేష్, బండ్రపల్లి నాగరాజు, వెంకట్, ముల్లపూడి నాగార్జున, మట్ట మహేష్, మాతంగి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలూరులో సంతకాల సేకరణ చేసిన వైసీపీ నాయకులు



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐలూరు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేశారు. పామర్రు మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్థానిక నాయకులు తెలిపారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ లతీఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ చేశారు.

# పునరావాస కేంద్రాలన్నీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పునరావాస కేంద్రాలన్నీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారము ఉదయం తన పర్యాటనలో భాగంగా కృష్ణవేణి స్కూల్ రోడ్, పటమట, విఎంసి పాఠశాల, సత్యనారాయణపురం, ఏలూరు రోడ్, వన్ టౌన్, గాంధీజీ మున్సిపల్ స్కూల్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా కృష్ణవేణి స్కూల్ రోడ్లో జరుగుతున్న అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్, పటమట, బెంజ్ సర్కిల్ వద్ద వర్షపు నీటి నిల్వలు ఉండకుండా శాశ్వత పరిష్కారం లో భాగంగా నిర్మిస్తున్న అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మొంథ తుఫాను నేపథ్యంలో విజయవాడ నగర నేపథ్యంలోపాలక సంస్థలు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందులో భాగంగా పటమట లోని వి ఎం సి స్కూల్, సత్యనారాయణపురం ఏకేటిపి స్కూల్, వన్ టౌన్ గాంధీజీ మున్సిపల్ హై స్కూల్‌లో పునరావాస కేంద్రాలు పరిశీలించారు. పునరావస కేంద్రాలలో ఎటువంటి లోపం ఉండరాదని, అక్కడ వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, వారందరికీ సమయానికి ఆహారం అందేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి గాంధీజీ మున్సిపల్ స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. అన్న కాంటీన్ లో వచ్చే ప్రజలతో మాట్లాడి అన్న క్యాంటీన్లో ఉన్న వసతులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో త్రాగు నీరు, వాడుకనీరు సరఫరాలో అంతరాయంలో ఉండ రాదని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కే సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్లు కే షమ్మీ, కే ప్రభుదాస్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె శ్రీనివాస్, ఏ శ్రీనివాసరెడ్డి, జీ. సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు





**మొవ్వ మేజర్ న్యూస్ :** కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే మండలంలోని వివిధ గ్రామాల్లో గల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన మొవ్వ శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు మొవ్వ బుచ్చి రామ రవీంద్రనాథ్ ఠాగూర్ పరమేశ్వనికి, బాలా త్రిపుర సుందరి అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఏకు వ జాము నుంచి అధిక సంఖ్యలో వచ్చ ఉసిరి చెట్టు, మారేడు చెట్టు కింద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కూచిపూడి లోని శ్రీ గంగాబాల త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## మండలంలో ఆరు పునరావాస కేంద్రాలు



**మొవ్వ మేజర్ న్యూస్:** మొంథా తుఫాన్ తుఫాన్ కారణంగా ప్రజలు ఇబ్బందులు గురి కాకుండా మండలంలో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ కే మస్తాన్ తెలిపారు. సోమవారం వాతావరణంలో ఏర్పడిన పెను మార్పులు దృష్ట్యా మొవ్వ పెదపూడి కూచిపూడి భట్లపెనుమర్రు కాజా కోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల ద్వారా భోజన వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ పునరావాస కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ 9 డిప్యూటీ కలెక్టర్ కుముదిని సింగ్, పరిశీలించి పురావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ తో పాటు ఎంపీడీవో బి డిప్యూటీ కలెక్టర్ తో పాటు ఎంపీడీవో డి. సుహాసిని, ఆర్ ఐ విజయదుర్గా, పంచాయతీ సచివాలయ సిబ్బంది ఉన్నారు.





## కార్తీక మాసం మొదటి సోమవారం.. శైవక్షేత్రాల్లో భక్తుల కిటకిట

**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** కార్తీక మాసంలోని మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ దీపకాంతులు వెదజల్లాయి. తెల్లవారుఝామునుండే భక్తులు శివాలయాల్లో దీపాలను వెలిగించి శివనామస్మరణలతో స్వామి వార్లను దర్శించుకున్నారు. పెరికీడులోని పంచాయతి క్షేత్రమైన శ్రీముక్తి కాంత సమేత ముక్తేశ్వ రాలయంలో అర్చకులు సీతారామయ్య, శ్యామ్, మహేష్ ఆధ్వర్యంలో ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. తదనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరవల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు కుందుర్తి మురళీశర్మ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. తెల్లవారుఝామునుండి మహిళలు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. మడిచర్ల, కానుమోలు, సిరివాడ, మల్లవల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తుల హరహర మహాదేవ శంభో శంకర నామ స్మరణలతో మార్మోగాయి.

## వరి కోత యంత్రాలకు ఆదరణ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రతికూల పరిస్థితుల్లో వరి పంటను కాపాడుకు నేందుకు, కూలీల సమస్యను అధిగమించేందుకు గత కొంత కాలంగా వరికోత యంత్రాల వినియోగానికి ఆదరణ పెరుగుతోం ది. వరికోత యంత్రాలతో కోతలు గత ఏడాది ముమ్మరంగా సాగాయి. చల్లపల్లి మండలంలో వరికోత య ంత్రాల ఆథరైజ్డ్ డీలర్ దినేష్ మేకా సోమవారం వరికోత యంత్రాన్ని (విశాల్ మరైన్) నెల్లూరు జిల్లా వాసి కటారి మునికి విక్రయించారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు చేతులమీదుగా యంత్రం తాళాలను యజమానికి అందచేశారు. 24.52 లక్షల విలువ చేసే వరికోత యంత్రం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందనీ, పనితీరులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నట్లు డీలర్ దినేష్ తెలిపారు. కృష్ణా, గుం టూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో కంపెనీ డీలర్గా ఉన్నారు. వరికోత యంత్రం పంజాబ్ రాష్ట్రంలో తయారు అవుతుందని తెలిపారు.

# కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి విషయంలో ఫలించిన ఎంపీ కృషి



**విజయవాడ మేజర్ న్యూస్ :** కొండపల్లి రైల్వే స్టేషన్ లో రైళ్లు ఎక్కేందుకు, దిగేందుకు అనువుగా సరైన ప్లాట్ ఫామ్ లేకపోవటంతో ప్రయాణీకుల పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సమన్వయంతో, ప్రజల విజ్ఞప్తి మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన కృషి ఫలించింది. కొండపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారమ్ విస్తరణ, ఎత్తు పెంపు కోసం ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన ప్రతిపాదనకు దక్షిణ మధ్య రైల్వే అంబ్రెల్లా వర్క్ 2024-25లో ఆమోదం లభించింది. కొండపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణ ఎత్తు పెంపు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ విషయాన్ని లేఖ ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ కి తెలియపర్చారు. అలాగే ఎంపీ కేశినేని శివనాథ్ అమృత్ స్టేషన్ పథకం కింద కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని కోరిన ప్రతిపాదనను తర్వాత దశలో పరిగణలోకి తీసుకుంటామని తెలియపర్చారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి రైల్వే స్టేషన్ ను జూన్ 3వ తేదీన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పరిశీలించారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తో పాటు, రైల్వే అధికారులు, ప్రయాణీకులు కొండపల్లి రైల్వే స్టేషన్ లోని సమస్యలను వివరించారు. స్టేషన్ లో సరైన ప్లాట్ ఫామ్ లేకపోవటానికి ప్రధాన సమస్యగా ప్రయాణీకులు తెలియపర్చారు. ప్రస్తుతం కొండపల్లి స్టేషన్ లో 366 మీటర్ల పొడవు ఉన్న ప్లాట్ ఫామ్ మాత్రమే వుంది. అందులో 136 మీటర్లు హై లెవల్, మిగతా 230 మీటర్లు లో లెవల్ ప్లాట్ ఫామ్ గా వుంది. దీంతో ప్రయాణీకుల రైళ్లు ఎక్కటానికి, దిగటానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వే సమస్యలను తక్షణం పరిష్కరించి..పలు లెవల్ క్రాసింగ్ వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ ఆగస్ట్ 22వ తేదీ సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ను స్వయంగా కలవటం జరిగింది.

ఆ సమయంలోనే కొండపల్లి రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు సౌకర్యంగా బోగీల్లో ఎక్కే విధంగా ప్లాట్ ఫామ్ లను విస్తరించటంతో పాటు ప్రయాణీకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటంతోపాటు, అమృత భారత్ 2.0 కింద కొండపల్లి రైల్వే స్టేషన్ ను ఆధునీకరించాలనే ప్రతిపాదన ను జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కు లేఖ ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ కోరటం జరిగింది. కొండపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకుల భద్రత కోసం పట్టుదలతో కృషి చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శివనాథ్ పార్లమెంటులోనూ, కేంద్ర స్థాయిలోనూ ప్రజల సమస్యలను బలంగా వినిపించి, అభివృద్ధి పనులకు అనుమతులు సాధించడంలో ముందుంటున్నారని ప్రజలు అభినందిస్తున్నారు.

# సురక్షిత ప్రాంతాలను ఆశ్రయించండి



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకుచేరుకుని పునరావాస కేంద్రాలను ఆశ్రయించాలని జిల్లా కలెక్టర్ బాలాజీ విజ్ఞప్తి చేశారు. సోమవారం కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న అయన అనంతరం మీడియా తో మాట్లాడారు జిల్లా మొత్తం అవసరం ఉన్న ప్రతి మండలంలోని గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, పూర్తి స్థాయిలో విద్యుత్, ఫైర్, పోలీస్, ఆరోగ్య, రెవిన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది నీ అందుబాటులో ఉంచామని, ఏ ఒక్కరు యిబ్బంది పడకుండా చూస్తామని అందరు ప్రభుత్వం, అధికారుల సూచనలు పాటించాలని బాలాజీ ఐఎఎస్ తెలిపారు. బంటుమిల్లిలో ఆయన్ను జగన్ కాలనీ వాసులు కలిసి తమ కాలనీ దుస్థితి వివరించారు. రైతు సంఘం నాయకులు గౌరీశెట్టి నాగేశ్వరావు రైతన్నల సమస్యలు పై అర్జీ యిచ్చారు. డీసీ చైర్మన్ బొర్రా కాశీ జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన డ్రెయిన్ లు బాగు చెయ్యాలని, లేకుంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ పి వీ విద్యా సాగర్ నాయుడు, తహసీల్దార్ లు శశి కుమార్, పూర్ణ చంద్రరావు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, టీడీపీ నాయకులు ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాల్లో అత్యంత నాణ్యమైన సౌకర్యాలు







## పారిశుద్ధ్యంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి

## జిల్లాలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన

## క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

**ఎన్‌టీఆర్ జిల్లా, అక్టోబర్ 27, మేజర్ న్యూస్ :** ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుపాను నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా క్షేత్రస్థాయిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ అర్బన్ పరిధిలో సున్నపుబట్టీల సెంటర్, గ్రంథాలయ రోడ్డు ప్రాంతంలో ఈ నెల 24న కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. పరిస్థితిని అంచనా వేసి నివాసితులను పునరావాస శిబిరాలకు తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మునిసిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ పెట్టాలన్నారు. మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే మునిసిపల్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి.. అక్కడ ఏర్పాటుచేసిన వైద్య శిబిరంతో పాటు బెడ్లు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, బెడ్డింగ్ మెటీరియల్, పారిశుధ్యం.. ఇలా ప్రతిఒక్కటీ అత్యంత నాణ్యంగా ఉండాలని స్పష్టం చేశారు. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని విపత్తు ప్రతిస్పందన పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నగర పర్యటన అనంతరం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

### పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలి

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలని.. వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డ్రెయిన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గుర్రపుడెక్క వంటివి ఉంటే వెంటనే తొలగించేలా చూడాలన్నారు. గ్రామ ప్రజల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో షిఫ్టల వారీగా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.



## కాలనీల్లో ముంపురాకుండా చర్యలు చేపట్టిన గుడ్లవల్లేరు పంచాయతీ

**గుడ్లవల్లేరు అక్టోబరు 27 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు పంచాయతీ అధికారులు మొంథా తుఫాను ముందస్తు చర్యలను సోమవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, విఆర్వో ఎస్. ప్రకాష్ లు మండల అధికారులు ప్రత్యేకాధికారి ఎంపిడివో ఇమ్రాన్, తహశీల్దార్ లోకరాజులతో కలసి గుడ్లవల్లేరు గ్రామంలో పలు ప్రాంతాలను సందర్శించి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. అదేవిధంగా ఎస్ఇఆర్ఎమ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం వద్ద చేయవలసిన సకల ఏర్పాట్లను కార్యదర్శి నరసింహారావు, వీఆర్వో ప్రకాష్, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది జరిగిస్తున్నారు. అలాగే తుఫాను ప్రభావంతో కురిసే భారీ వర్షాలకు పలు వార్డుల్లో, కాలనీల్లో, రోడ్లపై ఎక్కడా వర్షపు నీరు నిలువకుండా పారిశుద్ధ్య సిబ్బందితో ప్రధాన డ్రైన్లలో వున్న పూడికలను తొలగింపచేస్తూ శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, పారిశుద్ధ్య నిర్వాహకులు మురాల నరేష్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా కాలనీల్లో నీరు నిలిస్తే అత్యవసరంగా తోడటానికి మోటర్లను ముందస్తుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది శ్రీనివాసరావు, విఆర్‌పి ఆదర్శ్ పాల్గొన్నారు.

## శివాలయాలకు పోటెత్తిన భక్తులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కార్తీకమాసం మొదటి సోమవారం కావటంతో భక్తులు శివాలయాలు పోటెత్తారు. నడకుదురులోని మహిమాన్విత శైవక్షేత్రం శ్రీపృథ్వీశ్వరస్వామి ఆలయానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివెళ్లి స్వామివారికి అభిషేకాలు చేయించుకుని దీ పారాధనలు చేశారు. పవిత్ర కృష్ణా నదిలో స్నానాలు ఆచరించి ఆలయానికి వెళ్లారు. చల్లపల్లిలోని శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవాలయానికి భక్తులు బారులుతీరారు. లక్ష్మీపురంలోని శ్రీదుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేసి విశేష అలం కరణలు చేశారు.

## సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ నియామక స్కిల్ టెస్ట్ వాయిదా

### రిజిస్ట్రార్ డా. వి. రాధికా రెడ్డి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** డా.ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఈనెల 29,30 తేదీలలో నిర్వహించాల్సిన సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాల స్కిల్ టెస్ట్ నవంబర్ 05, 06 తేదీలలో నిర్వహించటం జరుగుతుందని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. వి రాధికా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చేసిన మార్పును అభ్యర్థులు గమనించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

## స్త్రీనిధిలో అసిస్టెంట్ మేనేజర్ హోదా ఉద్యోగాల ఇంటర్వ్యూ వాయిదా

### స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జివిబిడి హరిప్రసాద్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** స్త్రీనిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఇంటర్వ్యూలను తుఫాను కారణంగా వాయిదా వేసినట్లు స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జివిబిడి హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. "సైక్లోన్ మొంథా నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో స్త్రీనిధి ఏ.పి లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ హోదా ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 28 నుండి 31 వ తేదీ వరకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28,29,30,31 తేదీల్లో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలను డిసెంబర్ 01, 02, 03, 04 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే నవంబర్ 1 నుండి 29 వరకు నిర్వహించే ఇంటర్వ్యూ షెడ్యూల్స్ లో ఎలాంటి మార్పు లేకుండా యదావిధిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూకు ఎంపిక అయిన అభ్యర్థులకు ఇప్పటికే కాల్ లెటర్స్ పంపడం జరిగిందని, రిజిస్టర్ నెంబర్ ఆధారంగా కాల్ లెటర్స్ AP-online వెబ్సైటు నుండి డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జివిబిడి హరిప్రసాద్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

# నగరంలో జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద సెంటర్

## లాంచనంగా ప్రారంభించిన ప్రముఖ హీరో నవదీప్, హీరోయిన్, బిగ్ బాస్ బ్యూటీ దివి









**విజయవాడ మేజర్ న్యూస్:** నగరంలోని స్టెల్లా కాలేజ్, వందారు సాయి బాబా గుడి సమీపంలో నూతనంగా జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ ను ఏర్పాటు చేశారు. ప్రముఖ హీరో నవదీప్, హీరోయిన్ బిగ్ బాస్ బ్యూటీ దివి ముఖ్య అతిథులుగా విచ్చేసి జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి సెంటర్లో ఏర్పాటుచేసిన సేవల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రఖ్యాత గాంచిన జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ నిర్వాహకులు తమ సేవల విస్తరణలో భాగంగా విజయవాడలో కూడా సేవలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ విశేష సంఖ్యలో కస్టమర్స్ ఉండటం తాము చూసామని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తే వారు వ్యాపార రంగంలో రాణించగలరని తెలిపారు. ప్రస్తుత కాలంలో చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అందానికి ఫ్యాషన్ కు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని అన్నారు. బ్యూటీ సేవలతో పాటు ఆయుర్వేద సేవలు కూడా ఒకే చోట అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్‌ను తెలుగు రాష్ట్రాలలో మరిన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు నిర్వాహకులకు సూచించారు. అనంతరం జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ నిర్వాహకులు వెన్న శ్రీకాంత్, వెన్న జ్యోతి మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రారంభించిన జే లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తమ సేవలను విజయవాడ ప్రజలకు కూడా అందించేందుకు సెంటర్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలలో మరిన్ని క్లినిక్ ఏర్పాటు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ ప్రతి ఒక్కరికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని విజయవాడ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి, కార్పొరేషన్ చైర్మన్ దుండీ రాకేష్, బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ కార్పొరేషన్ చైర్మన్ గొట్టు ముక్కల రఘురామరాజు, పి ఎమ్ ఆర్ డి ఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్, సుభాష్ తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో ఉత్సాహంగా స్టూడెంట్స్ ఎల్ఈడి కాన్ఫరెన్స్












**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈ-చాంప్స్, ఫస్ట్, సెకెండ్ క్లాస్ స్టూడెంట్స్‌కి ఎల్ఈడి కాన్ఫరెన్స్ సోమవారం పటమట నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రిన్సిపాల్ ముత్తా రెడ్డి మాట్లాడుతూ ఇది విద్యార్థి యొక్క అకాడమిక్స్ ఎలా ఉన్నాయో తల్లిదండ్రులకు కళ్ళకు కట్టినట్టు చూపించేటువంటి అద్భుతమైన వేదిక అన్నారు. ఇందు ఫస్ట్ సెమిస్టర్‌లో జరిగినటువంటి సిలబస్ అన్నీ సబ్జెక్టులు ఇంగ్లీష్, మ్యాథ్స్, హిందీ, తెలుగు, ఇవిఎస్, కంప్యూటర్, అన్ని కార్నర్స్ గా డివైడ్ చేసి స్టూడెంట్స్‌ని తల్లిదండ్రులు ప్రశ్నలు వేస్తు వారి అకాడమిక్ పర్ఫామెన్స్ తెలియచేసేటువంటి ఒక మంచి ప్రోగ్రాం అన్నారు. ప్రోగ్రాం జరిగిన తర్వాత ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రంని ప్రధానం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కోఆర్డినేటర్ జహూర్ ఫాతిమా ఖాన్, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, ఈ-చాంప్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

## ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం, అక్టోబర్ 27, మేజర్ న్యూస్ :** కోస్తా తీరాన్ని తాకనున్న అతి తీవ్ర తుఫాను మెంత నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కుమారుడి బారసాల కార్యక్రమానికి హాజరయ్యేందుకు న్యూఢిల్లీ వెళ్లిన ఆయన సోమవారం ఉదయం తుఫాను ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు ఫోన్లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తీవ్ర తుఫాను కారణంగా పెనుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని అన్ని మండల కేంద్రాల్లో హెల్ప్ లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఏదైనా విపత్తు ఎదురైతే వెంటనే స్పందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. సోమవారం నుండి మూడు రోజుల పాటు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని, కూరగాయలు, పాలు, నిత్యావసర సరుకులు, అత్యవసర మందులు కొనుగోలు చేసుకోవాలని యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పునరావాస శిబిరాలకుయు తరలి వెళ్లాలని సూచించారు. వర్షాలు పడుతున్నప్పుడు పిడుగులు పడే ప్రమాదం ఉందని చెట్ల కిందకి వెళ్ళవద్దని సూచించారు. తుఫాన్ నష్ట నివారణకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అధికారులు ఎప్పటికప్పుడు తుఫాన్ సమాచారాన్ని ఉన్నతాధికారులకు, తనకు తెలియజేయాలని యార్లగడ్డ కోరారు.



## మొంథా తుఫాన్ ముందస్తు చర్యలు

**రెడ్డిగూడెం, అక్టోబర్ 27, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రెడ్డిగూడెం గ్రామపంచాయతీలో గత సంవత్సరం వరదల అనుభవాల దృష్ట్యా ఇళ్లల్లోకి వరద నీరు చేరకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోతుల వాగులో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత తీయించడమైనదని పంచాయతీ కార్యదర్శి ఎస్ రామారావు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ప్రజలందరికీ తుఫాను సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మైకు ద్వారా తెలియజేయడమైనది. తుఫానుపై రైతులకు అవగాహన కల్పించడమైనదని,, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో శానిటేషన్, వైద్య ఆరోగ్య శాఖ వారిచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించడమైనది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణి, ఉప సర్పంచ్ కొండపల్లి వెంకటేశ్వరరావు, మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ కుమార్, తిరువూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి ఏ వెంకటరమణ, తహశీల్దార్ సుశీల దేవి, ఎంపీడీవో టీ కేవీ రమణ, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, ఆర్ ఐ గంధం పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రామారావు, రెడ్డిగూడెం సచివాలయం-2 పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది,వెల్నెస్ సెంటర్ సిహెచ్ఓ రమణ, ఏఎన్ఎం సౌజన్య, ఆశాలు వర్కర్లు పాల్గొనడమైనది.

## మొంథా హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలో మొంథా తుఫాన్ (వాతావరణ శాఖ) హెచ్చరికల నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో మైలవరం పట్టణంలో లోతట్టు ప్రాంతా లలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు తెలుగు యువత మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు లంక లితీష్ పాల్గొన్నారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

### ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కోరారు. కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, చెట్ల దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. పిల్లలను బయటకు రానివ్వవద్దని, అత్యవసరమైతే తప్ప పెద్దలు కూడా ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసి ఉంచుకోవాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలను కూడా వాయిదా వేసుకోవాలని కోరారు. ప్రజలంతా ధైర్యంగా ఉండి జాగ్రత్తలు పాటిద్దాం అని పేర్కొన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలను చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999